## మినీ స్టేడియం ఏర్పాటు కలేనా?


హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్

- రెండేళ్ల క్రితం రూ. 10 కోట్లతో నిర్మాణానికి భూమి పూజ
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- నిలిచిపోయిన పనులు

**క్రీడాకారులకు పెట్టింది పేరైన హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ.10కోట్లు కేటాయించినప్పటికీ ఈ ప్రాంత క్రీడాకారుల ఆకాంక్ష నెరవేరడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రాష్ట్రంలో క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తున్నామని పదే పదే ఊదరగొట్టే కాంగ్రెస్ సర్కారు, ఇక్కడ మాత్రం నిధులున్నా తగిన సౌకర్యాలు కల్పించేందుకు చొరవ తీసుకోకపోవడం క్రీడాకారులను నిరుత్సాహానికి గురి చేస్తున్నది.**

హుజూరాబాద్, జూన్ 1: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో సకల హంగులతో మినీ స్టేడియం నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10కోట్లు కేటాయించింది. ఇందులో రూ.3కోట్ల 58 లక్షలతో 5678 చదరపు మీటర్ల వైశాల్యంలో ఫుట్‌బాల్ కోర్టు, రూ.2కోట్ల 85 లక్షలతో 3845 చదరపు మీటర్ల వైశాల్యంలో హాకీ కోర్టు, రూ.కోటీ 10 లక్షలతో 2903 చదరపు మీటర్ల వైశాల్యంలో వాకింగ్ ట్రాక్, రూ.28 లక్షలతో 670 చదరపు మీటర్ల వైశాల్యంలో టెన్నిస్ కోర్టు, రూ.29 లక్షలతో 605 చదరపు మీటర్ల వైశాల్యంలో బాస్కెట్‌బాల్ కోర్టు, రూ.27 లక్షలతో 400 చదరపు మీటర్ల వైశాల్యంలో క్రికెట్ పిచ్, రూ.38 లక్షలతో కబడ్డీ కోర్టు, మిగిలిన రూ.కోటీ 25లక్షలతో ఇతరాత్ర పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించగా.. ఆమేరకు పనులు మొదలయ్యాయి. దీంతో తమ కల త్వరలో సాకారం కానున్నదని క్రీడాకారులు సంతోషంలో మునిగిపోగా.. వారి ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. గ్రౌండ్ మినీ స్టేడియంగా మారుతున్న తరుణంలో అర్ధాంతరంగా పనులు నిలిపివేసింది. దీంతో వెటరన్ ఆటగాళ్లతో పాటు ప్రస్తుత క్రీడాకారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మినీ స్టేడియం పనులు తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పలుమార్లు కలెక్టర్‌కు వినతి పత్రం అందించినా ఫలితం లేకపోయింది.

### కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కృషితో హైస్కూల్ గ్రౌండ్‌లో మినీ స్టేడియం నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10కోట్లు నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల క్రీడాకారుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

*- గందె రాధిక, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్*

### ప్రభుత్వం అడ్డంకులు తొలగించాలి



గత బీఆర్ఎస్ సర్కార్ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు ఎక్కువగా ప్రాధాన్యత నిచ్చింది. ఇందులో భాగంగానే మినీ స్టేడియం కోసం నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేసి మినీ స్టేడియం నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలి.

*-పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే*

## ఘనంగా మిల్క్ డే


అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్, విద్యార్థులకు పాలను ఉచితంగా అందిస్తున్న కరీంనగర్ డెయిరీ ప్రతినిధులు

కార్పొరేషన్, జూన్ 1: వరల్డ్ మిల్క్ డే కార్యక్రమాన్ని కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్, క్రీడా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా వేడి పాలు, బిస్కెట్స్, బటర్ మిల్క్ పంపిణీ చేశారు. పాలతోనే జీవితం ప్రారంభం అవుతుందని, మనిషికి అమృత తుల్యం పాలు అని డెయిరీ ప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిలో కరీంనగర్ డెయిరీ మొదటి స్థానంలో ఉందన్నారు. పాలను సేకరించిన 24 గంటల్లో వినియోగదారులకు అందిస్తున్న ఏకైక డెయిరీ కరీంనగర్ అని పేర్కొన్నారు. ప్రతి రోజు 13 వందల గ్రామాల నుంచి 2 లక్షల లీటర్ల పాలను సేకరించి శుద్ధి చేసి నాణ్యమైన పాలు, వాటి ఉత్పత్తులను అందిస్తున్నామని తెలిపారు. డెయిరీ ద్వారా డోర్ డెలివరీ సదుపాయాన్ని కూడా అందిస్తున్నామని, దీని కోసం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెయిరీ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహాశక్తి ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

విద్యానగర్, జూన్ 1: కరీంనగర్ చైతన్యపురిలోని మహాశక్తి దేవాలయ 15వ వార్షికోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి, మహాదుర్గ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి విద్యారణ్య భారతి స్వామి మాట్లాడారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని వివరించారు. నేటితరం తల్లిదండ్రులను గౌరవించాలని, దేవాలయాలను సందర్శించాలని, సన్మార్గంలో నడవాలని, ధర్మాన్ని రక్షించాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 1: వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ రైతుల సంక్షేమ కోసం చేసిన సిఫార్సులను వెంటనే అమలు పరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను రక్షించేందుకు సాగు ఖర్చులో 50 శాతం ఎక్కువ గిట్టుబాటు ధరను చెల్లించాలని స్వామినాథన్ 2006లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని తెలిపారు. 19 సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన కనీస మద్దతు ధరతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధరలను సవరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 3న సైక్లింగ్ అవగాహన ర్యాలీ

కొత్తపల్లి, జూన్ 1 : ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 3న సైక్లింగ్ అవగాహన ర్యాలీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ డా. వి. నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వావిలాలపల్లిలోని జిల్లా సైకిల్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్ నుంచి ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ' డు సైక్లింగ్ బి హెల్తీ ' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సైక్లింగ్, క్రీడాభిమానులు ఉదయం 6 గంటల వరకు గీతా భవన్ చౌరస్తాకు రావాలన్నారు. ఇతర వివరాలకు 9398230614 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## మున్నూరు కాపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న మున్నూరుకాపు విశ్రాంత ఉద్యోగులు

కరీంనగర్ రూరల్, జూన్ 1: తెలంగాణ మున్నూర్‌కాపు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీర బుచ్చయ్య పటేల్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నగరంలోని ఓ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా అందరి సూచనల మేరకు సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. మండల కమిటీల ఏర్పాటుకు తీర్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కామ సతీశ్‌పటేల్, ఆకుల సంజీవరావు పటేల్, సాయినేని నరేందర్‌పటేల్, సాగర్ పటేల్, శ్రీగిరి శ్రీనివాస్ పటేల్, వంగ సుధాకర్ పటేల్, పెరుక నర్సయ్య పటేల్, ఉమామహేశ్వర్ పటేల్, మామిడి కృష్ణ పటేల్, దాసరి రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన కానిస్టేబుల్

కొత్తపల్లి, జూన్ 1 : ఆత్మహత్య చేసుకుంటానని వాటర్ ట్యాంక్ ఎక్కిన మండలంలోని బావుపేటకు చెందిన నేరెళ్ల సన్నిని కానిస్టేబుల్ కౌన్సెలింగ్ ఇచ్చి కాపాడిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. బావుపేట గ్రామానికి చెందిన సన్ని అలియాస్ దయాసాగర్ కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న కానిస్టేబుల్ విజయరావు వాటర్ ట్యాంక్ ఎక్కిన సన్నితో మాట్లాడుతూ కౌన్సెలింగ్ నిర్వహించారు. సన్ని షరతులకు అనుగుణంగా కుటుంబ సభ్యులను ఒప్పించి వాటర్ ట్యాంక్‌దింపి అతడి ప్రాణాలను రక్షించడంతోపాటు కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన గొడవలను సద్దు మణించేందుకు కుటుంబ సభ్యులకు సైతం కౌన్సిలింగ్ ఇచ్చాడు. కానిస్టేబుల్ విజయరావును కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ నగ్రాల, రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ ఎస్. సాంబమూర్తి అభినందించారు.

## ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కమిటీ

వీణవంక, జూన్ 1: మండలంలోని బేతిగల్ గ్రామంలో ఆదివారం ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టుముక్కల రవీందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్‌గా కంబాల శ్రీనివాస్, సెక్రటరీగా కాటం రవి, కోశాధికారిగా బొమ్మలేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ట్రాక్టర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు రవీందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన యప్‌టీవీ చైర్మన్


వీణవంకలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి

వీణవంక, జూన్ 1: మండల కేంద్రంలో ఇటీవల పలువురు మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను ఆదివారం యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన సమిండ్ల రామవ్వ, రాయిశెట్టి రాజయ్య, రేపాల ప్రశాంత్, టేకు రాంచందర్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతిచెందగా, వారి చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, నాయకులు సమ్మిరెడ్డి, అమృత ప్రభాకర్, సమిండ్ల చిట్టి, మర్రి రవి, అప్పని కొమురయ్య, సిబ్బంది ఉన్నారు.

## లయన్స్ క్లబ్స్ నూతన ప్రతినిధుల బాధ్యతల స్వీకరణ


ప్రతిజ్ఞ చేస్తున్న క్లబ్ బాధ్యులు

విద్యానగర్, జూన్ 1: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బాలాజీనగర్ (13వ), శ్రీనిధి (8వ), అక్షర (7వ) సంవత్సరం క్లబ్‌ల ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం స్థానిక జ్యోతినగర్ ఓల్డ్ డీఐజీ బిల్డింగ్ సమీపంలోని శ్రీనిధి చిట్స్ మీటింగ్ హాల్‌లో ఆదివారం ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో బాలాజీనగర్ క్లబ్ అధ్యక్షుడిగా లయన్ ఎ. రవీందర్ రెడ్డి, అక్షర క్లబ్ అధ్యక్షుడిగా లయన్ కె. శ్రీనివాస్, శ్రీనిధి క్లబ్ అధ్యక్షుడిగా లయన్ జి. కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పూర్వ జిల్లా గవర్నర్ లయన్ ఎ. శివ ప్రసాద్ ప్రతి అధికారికి బాధ్యతలు, విధులు వివరించారు. సమర్థ నాయకత్వం, సేవా ప్రణాళికలు, సమగ్ర సమన్వయంపై సూచనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ (ఎంసీసీ) లయన్ హన్మాండ్ల రాజిరెడ్డి, లయన్స్ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. క్లబ్బులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలని, ప్రతి సభ్యుడూ చురుకుగా పాల్గొనేలా చూడాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ సింగిరెడ్డి వాసుదేవ రెడ్డి, డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, ఎం రమణారెడ్డి, సంతోష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆర్సీ సంపత్‌కుమారీ, జెడ్‌సీ బి. మల్లారెడ్డి, సీతారాంరెడ్డి, రవికంటి కృష్ణ కిశోర్, టీ అరుణ, క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి

గంగాధర, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఆదివారం ప్రకటనలో కోరారు. మండలంలోని బూరుగుపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయం నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొని జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. గంగాధర మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

రామడుగు, జూన్ 1: దేశరాజుపల్లి గ్రామానికి చెందిన ఈరుమల్ల బాలమ్మ(74) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కిడ్నీలో రాళ్లు రావడంతో ఆపరేషన్ చేయవలసి వస్తుందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ చేయించుకోవడానికి భయపడిన బాలమ్మ శనివారం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి వారి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఆమె భర్త కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 1: నగరంలోని భగత్ నగర్‌లో 11కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10నుంచి 11గంటల వరకు అయోధ్యనగర్, కట్టరాంపూర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ ఎం లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## 'ప్రైవేట్ పాఠశాల నిర్వాకంతో విద్యార్థులకు నష్టం'

వీణవంక, జూన్ 1: చల్లూరు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నిర్వాకంతో పైచదువులకు వెళ్లే విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని మాజీ ఎంపీటీసీ తాండ్ర శంకర్ ఆరోపించారు. సదరు పాఠశాల యాజమాన్యం అందుబాటులో లేకపోవడం వల్ల సమయానికి స్టడీ, బర్త్ సర్టిఫికెట్‌లు అందడంలేదని, ఫలితంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

గంగాధర, జూన్ 1: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసికోల్లాసం కలుగుతుందని నాయకుడు పుల్కం రవీంద్రనాథ్ ఠాగూర్, మాజీ ఉపసర్పంచ్ గాలిపెల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని మధురానగర్‌లో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల, గంగాధర జట్ల మధ్య స్నేహపూర్వక మ్యాచ్‌ను నిర్వహించారు. విజేతగా నిలిచిన గంగాధర జట్టుకు బహుమతులు అందజేశారు. ఇక్కడ నిర్వాహకులు గంట విజయ్, కట్ల శ్రీనివాస్, మనోజ్, నరేశ్, ప్రణయ్, రాంకీ, శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి వీర్ల పరామర్శ


కిషన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, జూన్ 1 : వెలిచాల గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గర్వంధుల కిషన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించారు. కిషన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచుల వీర్ల రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

## రక్షిత తాగునీటి బావి మోటర్ల వైర్లు చోరీ

కరీంనగర్ రూరల్, జూన్ 1: నల్లగుంటపల్లి గ్రామంలోని రక్షిత తాగునీటి బావి విద్యుత్ మోటర్ల వైర్లు చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇరుకుల్ల వాగులో ఉన్న తాగునీటి బావికి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి కనెక్షన్లు ఇచ్చారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 150 మీటర్ల మేర విద్యుత్ వైర్లను కట్ చేసి తీసుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.20 వేల వరకు ఉంటుందని పంచాయతీ సిబ్బంది తెలిపారు. పరిసర ప్రాంతాల్లోని విద్యుత్ మోటర్ల వైర్లు సైతం కొంత కాలంగా చోరీ అవుతున్నాయని గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు


నగరంలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు


హుజూరాబాద్ టౌన్: ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాగార్జున హైస్కూల్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 1: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల 2005-08 విద్యాసంవత్సం పూర్వ విద్యార్థులు స్థానిక ఓ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కేక్ కట్ చేసి, ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అమరగొండ కిషన్, మెండే పరశురాములు, సత్తు అనిల్, సోమినేని సతీశ్, ఉప్పు దిలీప్, స్వాతి, శ్వేతా రెడ్డి, జ్యోతి, శ్రీవిద్య, లావణ్య, స్వప్న, రజిని, భవాని, రాజు, రవి, బాలకృష్ణ, మహేందర్, పవన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, జూన్ 1: చామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం 32 సంవత్సరాల తర్వాత పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు తుమ్మ రామస్వామి, అనంద రాములు, ప్రేమ్‌కుమార్, శ్రీధర్‌రావు, ప్రభాకర్ రావును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, జూన్ 1: పట్టణంలోని నాగార్జున హైస్కూల్‌లో 1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం ఆదివారం పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డితో పాటు ఇతర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

కలెక్టరేట్, జూన్ 1: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముందుగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు పతాకావిష్కరణ చేస్తారని, అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, వందన స్వీకారం, మంత్రి సందేశం, అమరవీరుల కుటుంబాలకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పోలీస్ మెడల్స్ పంపిణీ, సంక్షేమ పథకాల ఉత్తర్వుల పంపిణీ, మైదానంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలన, తేనీటి విందు ఉంటుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

కలెక్టరేట్, జూన్ 1: కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ వేడుకల నేపథ్యంలో ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలి


హైకోర్టు ఉత్తర్వులు చూపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కలెక్టరేట్, జూన్ 1 : మధ్యాహ్న భోజన కార్మికుల వేతన పెంపుపై హైకోర్టు విడుదల చేసిన ఆదేశాలు వెంటనే అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల అభిమానుల చారి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా సమావేశం ఆదివారం నగరంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కొత్త విద్యాసంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.17వేల వేతనం అందజేయాలని డబ్ల్యూపీ నంబర్ 32153, 34171, 34768 ఆఫ్ 2024 పేర ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, లేనిపక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని, నిరవధిక సమ్మె చేపట్టేందుకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు కుర్ర మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.బాబాయ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, వంట కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల స్వరూప, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు షేక్ హబీబ్‌తో పాటు 70 మంది వరకు కార్మికులు పాల్గొన్నారు.

## 'ఎస్సీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శిని తొలగించాలి'

కలెక్టరేట్, జూన్ 1 : గురుకుల విద్యార్థుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన షెడ్యూల్డ్ కులాల గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే తొలగించాలని, గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని మంకమ్మతోటలోని ఓ హోటల్‌లో గల బాంకెట్ హాల్‌లో తెలంగాణ గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేసి, వివాదానికి ఆజ్యం పోసిందని మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల పట్ల సమాజంలో చిన్నచూపు చూసే అవకాశముంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యూరోక్రాట్‌గా పేద, బలహీన వర్గాల విద్యార్థుల శ్రేయస్సును కోరాల్సి ఉండగా, అనుచితంగా మాట్లాడడం ఏమేరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అనుచిత వ్యాఖ్యలు చేసిన గురుకుల సొసైటీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఐల వివేక్, ఇరుగురాల రాజు, కారెంగుల స్వప్న, దోర్నాల రజిత, గబ్బెట రాము, పైడిమడుగు మల్లేశ్, అందె లక్ష్మీరాజం, బెజ్జంకి శ్రీనివాస్, పప్పు రాములుతో పాటు పలు ప్రాంతాల నుంచి వందమందికి పైగా పాల్గొన్నారు.

## పట్టణంలో నేడు 2కే రన్

హుజూరాబాద్/టౌన్, జూన్ 1: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజూరాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం 2కే రన్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5:30 గంటలకు స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి జమ్మికుంట రోడ్డులోని సాయిరూప ఫంక్షన్, ప్రభుత్వ హాస్పిటల్ హాల్ మీదుగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానం వరకు 2కే రన్ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి పౌరుడూ పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రైతులకు అవగాహన

మానకొండూర్ రూరల్, జూన్ 1: మానకొండూర్, గంగిపల్లి గ్రామాల్లో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం(జమ్మికుంట),వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సునీత, డాక్టర్ శివ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

**NCC CAMP**
9 (T) BN NCC Karimnagar from 04 June 2025 to13 June 2025. Is Conducting CATC Camp the Cadets of the Given School/college Should Report At The given plase Time And date Address: Alphores International Residential School Rajajinagar Vedira Ramadugu MDL Ramadugu Cross road Karimnagar Telangana INDIA' **Mobile: 9205884579**







